


# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక :173 | గురువారం 25 జూన్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## తెలంగాణ ప్రజలను మోసం చేసేందుకే రాష్ట్రపతికి బీసీ బిల్ పంపారు

బిజెపి ఎంపీ డాక్టర్ లక్ష్మణ్



## మహేశ్ కుమార్ గౌడ్ నోరు అదుపులో పెట్టుకో..

●అబద్ధాల పోటీలో రేవంత్ నెం.1, మహేష్ గౌడ్ నెం.2 ●బనకచర్లపై చర్చకు సిద్ధం ..ఎక్కడికైనా వస్తా ●అసెంబ్లీ పెట్ట చేతగాక పారిపోతున్నారు ●రైతుబంధు సృష్టికర్త కేసీఆర్ ●లోకల్ బాడీ ఎన్నికల నుంచి కాంగ్రెస్ వెనుకడుగు: ఓటమి భయమే కారణమా? ●కేసీఆర్ కిట్టు లేదు అంటారా? మాటల మాయాజాలం నమ్మదని ప్రజల నిర్ణయం స్పష్టం - హరీష్ రావు



## హనీమూన్ పిరియడ్ ముగిసింది.. ఇక యుద్ధమే

●చంద్రబాబు హామీలను ఎండగట్టండి ●ఒకే ఏడాది పాలనలో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ●పచ్చి మోసాలు మాత్రమే.. హామీల అమలు శూన్యం● ప్రజల్లోకి వెళ్లండి, ప్రశ్నించండి: వైసీపీ నేతలకు జగన్ ఆదేశాలు

న్యూస్ డెస్క్,25 జూన్ (కెరటం న్యూస్): 'మీ ఇంటికి టీడీపీ నాయకులు రాగానే నిలదీయాలి. గత ఏడాది నుంచి ఇంత బాకీ.. ఈ ఏడాది ఇంకా ఎంత రావాలి అనేది తెలియజేయాలి. ఇవి కాకుండా, చంద్రబాబు గత ఎన్నికల్లో ఏం చెప్పాడు?, పథకాల వారీగా వివరిస్తూ.. వాస్తవానికి ఇప్పుడు ఏం చేస్తున్నాడు?..' అని ప్రశ్నించండి



## ఏ ఎన్నికలు వచ్చినా మాకు తిరుగులేదు

●జుబ్లీహిల్స్ లో గెలిచి తీరుతాం ● రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నాం..- టీపీసీసీ చీఫ్

న్యూస్ డెస్క్,25 జూన్ (కెరటం న్యూస్): బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంగళవారం రైతుభరోసా విజయోత్సవ సభలో సీఎం చెప్పినట్లుగా పదేళ్ల బీఆర్ఎస్ పాలన..ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమని అన్నారు.




## కేసీఆర్ దమ్మేంటో ఒరిజినల్ కాంగ్రెస్ పార్టీకి తెలుసు

: ఎమ్మెల్సీ కవిత



●"తెలంగాణ వచ్చింది కాబట్టే మీరు సీఎం అయ్యారు" ●కవిత నేతృత్వంలో సోనియా గాంధీకి వేలాది పోస్టు కార్డులు: హామీల అమలుపై ఆగ్రహం ● మహిళల మోసం పట్ల అసెంబ్లీలో చర్చిద్దాం ●గ్యారంటీలు అమలు చేయకపోతే ప్రజలు కాంగ్రెస్‌ను క్షమించరు: ఎమ్మెల్సీ కవిత హెచ్చరిక



## బనకచర్ల ప్రాజెక్టుపై న్యాయ పోరాటం చేస్తాం

● తెలంగాణకు అన్యాయం జరుగుతోంది ● జూన్ 30న బనకచర్లపై డీటెయిల్ ప్రజెంటేషన్: రాజకీయ కుట్రను బహిర్గతం చేస్తాం ● బనకచర్లపై న్యాయపోరాటానికి సిద్ధం అవుతున్న తెలంగాణ - మంత్రి ఉత్తమ్ ● ఏపీ తీరుతోనే వివాదం పెరుగుతోంది - సీఎం రేవంత్ రెడ్డి



## రోదసిలోకి శుభాంశు శుక్లా

నమస్తే ఇండియా.. మీరంతా నా వెంటే అంతరిక్షం నుంచి శుభాంశు శుక్లా మెసేజ్



## మెట్రో ఫేజ్-2కు కేంద్రం మొండిచేయి

: మంత్రి శ్రీధర్ బాబు

న్యూస్ డెస్క్,25 జూన్ (కెరటం న్యూస్): తెలంగాణ ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కేంద్ర కేబినెట్ నిర్ణయాల పై అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్లో హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ వస్తుందని ఆశించామని, ఈ విషయంలో మరోసారి రాష్ట్రానికి మొండిచేయి ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు మెట్రో ఫేజ్-2 (ఫేజ్ II -ఎ, II -బి) కీలకమని, దీనిపై కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు



## గతంలో ఫ్యాక్షన్ మర్డర్స్ .. ఇప్పుడు లవ్ మర్డర్స్

●భర్త కోసం యమధర్మరాజుతో కూడా కొట్లాడిన భార్యలను చూశా - వీ హెచ్ ఎమోషనల్ కామెంట్స్ ●కానీ ఇప్పుడు భర్తలను భార్యలు, తల్లిని పిల్లలు హత్య చేస్తున్న దారుణ పరిస్థితి ●సోషల్ మీడియా ప్రభావంతో హత్యలకు హీరోయిజం ముద్ర ●కోలివింగ్ పేరిట సంస్కృతి నాశనం ●గద్వాల నుంచి జీడిమెట్ల వరకు వరుస లవ్ మర్డర్స్.. సమాజం ఏ దిశగా పోతోంది? - వి హనుమంతరావు

## ఐఏఎస్ అధికారులు వారానికి రెండు పాఠశాలలను సందర్శించాలి..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



న్యూస్ డెస్క్,25 జూన్ (కెరటం న్యూస్): తెలంగాణలో విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు వారంలో కనీసం రెండు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని సీఎం సూచించారు. విద్యా శాఖపై ఐసీసీసీలో సీఎం రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో 48 వేల మంది చేరారని అధికారులు సీఎంకు వివరించారు. పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నూతన గదులు నిర్మించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు అవసరమైన వసతులను పాఠశాలల్లో కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.



## గ్రామపంచాయతీ ఎన్నికలు 3 నెలల్లో నిర్వహించాలి

●కీలక తీర్పు వెల్లడించిన హైకోర్టు

● 2025 సెప్టెంబర్ 30లోపు స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలి ● రిజర్వేషన్ల పేరిట ఎన్నికలు వాయిదా వేసే పరిస్థితి అర్థవంతం కాదు - న్యాయమూర్తి వ్యాఖ్యలు

● ఎన్నికలు జరగక ఇబ్బందులు పడుతున్న గ్రామాలు -హైకోర్టు తక్షణ చర్యల ఆదేశం



న్యూస్ డెస్క్,25 జూన్ (కెరటం న్యూస్): తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది .2025 సెప్టెంబర్ 30 లోపు తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది, 30 రోజుల్లో వార్డుల విభజన ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవీదేవి బుధవారం తీర్పు వెలువరించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు 2024 జనవరి 30వ తేదీతో ముగిసినా ఎన్నికల నిర్వహణలో జాప్యం ఎందుకని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ప్రశ్నించింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని సవాలు చేస్తూ పలువురు మాజీ సర్పంచులు దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన జస్టిస్ టి.మాధవిదేవి బుధవారం తీర్పు ఇచ్చారు.

తొలుత పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. "గతేడాది జనవరి 31తో సర్పంచుల పదవీ కాలం ముగిసినా.. ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోంది. సర్పంచులను తప్పించి పంచాయతీల బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించింది.


# ఏ ఎన్నికలు వచ్చినా మాకు తిరుగులేదు

అదేవిధంగా స్థానిక ఎన్నికల నిర్వహణ న్యాయస్థానం తీర్పుకు అనుగుణంగా ఉంటుందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్ పార్టీ చర్చించి నిర్ణయం ఓ నిర్ణయం తీసుకుంటుందన్నారు. కాంగ్రెస్ 18 నెలల పాలన గోల్డెన్ పిరియడ్ అని అన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ నేతలు నోరు మెదపడం లేదని కామెంట్ చేశారు. రాబోయే స్థానిక ఎన్నికలు, జుబ్లీహిల్స్ ఉపఎన్నికకు పార్టీని సన్నద్ధం చేసేలా పలు కీలక నిర్ణయాలుతో వచ్చే GHMC ఎన్నికలపై అనుసరించాల్సిన వ్యూహాలపై వరుస సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. జుబ్లీహిల్స్ ఎన్నికల్లో పోటీ చేయడమే కాదు గెలిచేది కూడా తామేనని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నాం..

రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసి రికార్డు సృష్టించామని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ రైతు పక్షపాతి ప్రభుత్వమని మరోసారి నిరూపించుకున్నామని తెలిపారు. తెలంగాణలో ఎప్పుడు ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో, జుబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తమకు తిరుగు లేదన్నారు. మూడు ముక్కలాటతో బీఆర్ఎస్ పార్టీ ఖేల్ ఖతం అయిందన్నారు. కవిత చెప్పినట్టు బీఆర్ఎస్‌లో దెయ్యాలుంటే.. కాంగ్రెస్‌లో దేవతలున్నారని కామెంట్ చేశారు. మహిళల అభివృద్ధి గురించి కవిత మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. బీజేపీ రాజ్యసభ సభ్యులు కృష్ణయ్య. కవితకు మద్దతు మాట్లాడటం విచారకరమని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వెలగబెట్టింది ఏమి లేదని.. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి ఫోన్ ట్యాపింగ్ చేశారని ఫైర్ అయ్యారు. దేశ చరిత్రలో అదో హేయమైన చర్య అని మండిపడ్డారు. ఈ కేసులో ఎంతటి వారు ఉన్నా.. శిక్ష తప్పదని అన్నారు. కాళేశ్వరంతో పాటు పలు కుంభకోణాలను వెలుగుతీసి ఎవరినీ వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. కేంద్రం ప్రభుత్వం రాష్ట్రానికి న్యాయపరంగా రావాల్సిన నిధులను, పథకాలను మంజూరు చేయకుండా వివక్ష చూపిస్తోందని అన్నారు. బనకచర్లతో రాష్ట్రానికి అన్యాయం జరిగితే చూస్తూ ఊరకోబోమని.. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు కట్టుకోమని జీవోలు ఇచ్చింది బీఆర్ఎస్ పార్టీ కాదా అని మండిపడ్డారు. కృష్ణా జలాల విషయంలో హరీశ్ రావు సంతకం ఎందుకు పెట్టిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అభూత కల్పనతో బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా వ్యవస్థను నడుపుతున్నారని.. వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అటువంటి ప్రచారాలను ప్రజలు తిప్పి కొట్టాలని మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

# గతంలో ఫ్యాక్షన్ మర్డర్స్ ..ఇప్పుడు లవ్ మర్డర్స్



**న్యూస్ డెస్క్,25 జూన్ (కెరటం న్యూస్):** ప్రస్తుత రోజుల్లో సమాజంలో జరుగుతున్న దారుణాల పట్ల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి హనుమంతరావు ఆవేదన వ్యక్తం చేశారు. హనుమంత రావు మాట్లాడుతూ.. సమాజంలో భర్తలను భార్య.. తల్లినీ.. బిడ్డ చంపడం చూస్తుంటే బాధ ఐతుందన్నారు. ఒకప్పుడు ఫ్యాక్షన్ మర్డర్స్ జరిగేవి. ఇప్పుడు లవ్ మర్డర్స్ జరుగుతున్నాయని తెలిపారు. అబ్బాయి, కానీ అమ్మాయి కానీ మీకు నచ్చకపోతే పెళ్లి చేసుకోకండి.. మీకు నచ్చిన వారినే చేసుకోండని సూచించారు. సమాజం ఎక్కడికి పోతుంది..? యమధర్మ రాజుతో కూడా భర్త కోసం కొట్లాడిన భార్యలను చూశానని అన్నారు. కానీ ఇప్పుడు జరుగుతున్న హత్యలు చూస్తుంటే మానవ సంబంధాలకు ఏమైతుంది అని అనిపిస్తుందన్నారు. పాత రోజులే బాగున్నె అనిపిస్తుంది.

సోషల్ మీడియాలో ఇలాంటి ఘటనలు ఎక్కువ ప్రచారం చేస్తున్నారు. దీన్ని హీరోయిజం అనుకుంటున్నారని వాపోయారు. సాఫ్ట్‌వేర్లు కో లివింగ్ పేరిట అడ్డదార్లు తొక్కుతున్నారు. మంత్రి శ్రీధర్ బాబు దీనిపై ఆలోచన చేయాలి.. ఇలాంటి వాటిని అరికట్టాలని కోరారు. అమ్మాయి.. అబ్బాయి ఒకే రూమ్ లో ఉండే విధానం బాగాలేదు. ప్రభుత్వం ఆలోచన చేయాలి.. లేదంటే ఇలాంటి హత్యలు జరుగుతూనే ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సీఎం రేవంత్.. షీ టీం తో చర్చలు జరపాలని కోరారు. సమాజంలో ఉన్న విద్యావేత్తలు.. డాక్టర్ లు.. ఆలోచన చేసి దారుణాలను అరికట్టడానికి తమవంతు కృషి చేయాలని కోరారు.

గద్వాలలో ఐశ్వర్య అనే యువతి తేజేశ్వర్ ను పెళ్లి చేసుకుని ప్రియుడి సాయంతో భర్తను కాటికి పంపిన విషయం తెలిసిందే. పెళ్లైన నెల రోజులకే దారుణానికి ఒడికట్టింది. అంతకు ముందు ఇండోర్ కు చెందిన రాజా రఘువంశీని ఇష్టం లేని పెళ్లి చేసుకున్న సోనమ్ హనీమూన్ కోసమని మేఘాలయకు తీసుకెళ్లి ప్రియుడితో కలిసి కిరాయి హంతకులతో చంపేసింది. ఇక నిన్న జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో పదో తరగతి బాలిక తన ప్రియుడితో ప్రేమ పెళ్లికి ఒప్పుకోవడం లేదని తల్లిపై కక్షగట్టి ప్రియుడి సాయంతో దారుణంగా హతమార్చింది. రోజుల వ్యవధిలోనే వరుస ఘోరాలు జరుగుతుండడంతో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

# మహేశ్ కుమార్ గౌడ్ నోరు అదుపులో పెట్టుకో..
## హరీశ్ రావు వార్నింగ్



**న్యూస్ డెస్క్,25 జూన్ (కెరటం న్యూస్):** అబద్ధాల్లో సీఎం రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పోటీపడుతున్నారని అబద్ధాల్లో రేవంత్ రెడ్డి నంబర్ వన్ అయితే మహేశ్ కుమార్ గౌడ్ నంబర్ 2 అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. మహేష్ కుమార్ గౌడ్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలన్నారు. బనకచర్ల గురించి కాంగ్రెస్ పార్టీకి మాట్లాడి నైతిక హక్కు లేదన్నారు. ఏ టీవీలో కూర్చుందామో చెప్పు.. ఎక్కడ మాట్లాడుతామో చెప్పు.. నేను సిద్ధం.. నువ్వు చర్చకు వస్తావా అని మహేశ్ కుమార్ గౌడ్ కు సవాల్ విసిరారు. అసెంబ్లీ పెట్ట చేతగాక పారిపోతున్నారని, బీఆర్ఎస్ పార్టీ నిలదీస్తుందని భయంతో వారం రోజులకు మించి అసెంబ్లీ నడిపే పరిస్థితి లేదని దుయ్యబట్టారు. దమ్ముంటే 40 రోజులు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సమాధానం చెప్పడానికి మా బీఆర్ఎస్ కార్యకర్త చాలని అన్నారు. ఇవాళ సిద్దిపేటలో సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం యూత్ కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల ప్రశాంత్ పాటిల్ అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడిన హరీశ్ రావు కాంగ్రెస్ పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

మాటలు ఎక్కువ చేతలు తక్కువ:

రేవంత్ రెడ్డి 18 నెలల పాలన చూశాక కాంగ్రెస్ పార్టీ అంటే ఏంటో ప్రజలకు అర్థమైందని అందుకే మళ్ళీ కేసీఆర్ రావాలి, కావాలి అంటున్నారన్నారు. మళ్లీ పదేండ్ల దాకా కాంగ్రెస్ పార్టీ విత్తనం కూడా పుట్టకుంట రేవంత్ రెడ్డి చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మాటలు ఎక్కువ చేతలు తక్కువ అని దుయ్యబట్టారు. కేసీఆర్ కిట్టు, బతుకమ్మ చీరలు, గ్రామపంచాయతీలో టాక్టర్లకు ఇంధనానికి కూడా డబ్బులు లేక బంద్ పెట్టారని మండిపడ్డారు. పోయిన వానకాలం, యాసంగి రైతుబంధు ఎగ్గొట్టారన్నారు. రూ.15,000 రైతుబంధు ఇస్తానని రూ.12,000 ఇచ్చినందుకు రేవంత్ రెడ్డి ముక్కు నేలకు రాసి రైతాంగానికి క్షమాపణలు కోరాలన్నారు. రైతుబంధు సృష్టికర్త కేసీఆర్. దేశానికి రైతుబంధును పరిచయం చేసింది కేసీఆర్. అన్నారు. కాంగ్రెస్ ఓట్లకు ఓట్లకు రైతుబంధు ఇస్తే, నాట్లకు నాట్లకు మధ్యలో రైతుబంధు వేసింది కేసీఆర్ అన్నారు. కేసీఆర్ కిట్టు లేదు, సూది లేదు, మందు లేదని మీ చిల్లర ఉపన్యాసాలు ప్రజలు నమ్మరన్నారు. లోకల్ బాడీ ఎన్నికలు ఎందుకు పెట్టడం లేదు ఓడిపోతామని భయంతోనే కదా మహేష్ కుమార్ గౌడ్ అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పూర్తి అయిదు సంవత్సరాలు అధికారంలో ఉండాలి. 20 ఏళ్ల దాకా కాంగ్రెస్ పార్టీ రాదని కార్యకర్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటానన్నారు. మళ్లీ సర్పంచ్, మండల, జిల్లా పరిషత్తులు గెలవాలి. అందరం కలసి ఐక్యతతో ముందుకు పోదామన్నారు.

# ఐఏఎస్ అధికారులు వారానికి రెండు పాఠశాలలను సందర్శించాలి..

మధ్యాహ్న భోజనం తయారీకి సంబంధించి గ్యాస్, కట్టెల పొయ్యిల బాధల నుంచి మధ్యాహ్న భోజనం తయారు చేసే మహిళలకు విముక్తి కల్పించాలని%ా% సోలార్ కిచెన్లు ఏర్పాటుపై తక్షణమే దృష్టి సారించాలని రేవంత్ రెడ్డి అధికారులకు తెలియజేశారు. పదో తరగతిలో ఉత్తీర్ణులవుతున్న విద్యార్థుల సంఖ్యకు, ఇంటర్మీడియట్‌లో నమోదు అవుతున్న విద్యార్థుల సంఖ్యకు మధ్య వ్యత్యాసం ఎక్కువ ఉండడంపై సీఎం అధికారులను ప్రశ్నించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా కచ్చితంగా ఇంటర్మీడియట్‌లో చేరేలా చూడాలని సీఎం సూచించారు. ఇంటర్మీడియట్ అనంతరం జీవనోపాధికి అవసరమైన స్కిల్డ్ కోర్సుల్లో శిక్షణ పొందవచ్చని.. తద్వారా వారి జీవితానికి ఢోకా ఉండదని సీఎం అభిప్రాయపడ్డారు.

# కేసీఆర్ దమ్మేంటో ఒరిజినల్ కాంగ్రెస్ పార్టీకి తెలుసు : ఎమ్మెల్సీ కవిత

**న్యూస్ డెస్క్,25 జూన్ (కెరటం న్యూస్):** కేసీఆర్ దమ్మేంతా అన్నది ఒరిజినల్ కాంగ్రెస్ పార్టీకి తెలుసు కాబట్టే తెలంగాణ వచ్చింది అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. తెలంగాణ వచ్చింది కాబట్టే ఇవాళ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అది మరిచిపోయి రేవంత్ రెడ్డి మాట్లాడడం బాధాకరం అని కవిత అన్నారు. మహిళలకు రూ. 2500, పెన్షన్ల మొత్తం పెంపుపై ఎమ్మెల్సీ కవిత పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. ఆరు గ్యారెంటీల అమలు, మహిళలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసంపై అసెంబ్లీలోనే చర్చిద్దామన్నారు. రేవంత్ రెడ్డి చంద్రబాబును పిలిచి హైదరాబాద్ బిర్యాని పెట్టి గోదావరి నీళ్లను గిఫ్ట్‌గా ఇచ్చారు. 2016లో పోలవరం, బనకచర్ల అంశమే లేదు. రేవంత్ రెడ్డికి అబద్దాలు ఆడడం అలవాటైంది. గ్యారెంటీలు అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించడం సరికాదు. యస్.. అసెంబ్లీ పెడుదాం%ా% ఆరు గ్యారెంటీల అమలు, మహిళలను మోసం చేసినదానిపై చర్చిద్దామన్నారు కవిత. రేవంత్ రెడ్డి హుందాగా వ్యవహరించాలి. కేసీఆర్ కలలో కూడా తెలంగాణకు నష్టం చేయరు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్ పార్టీని ప్రజలు క్షమించరు అని కవిత పేర్కొన్నారు. ఇక ఎమ్మెల్సీ కవిత నేతృత్వంలో సోనియా గాంధీకి వేలాది పోస్టు కార్డులు రాశారు. అబిడ్స్ జీపీవోలో ఎమ్మెల్సీ కవిత, జాగృతి కార్యకర్తలు పోస్ట్ కార్డులను పోస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తయినా ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. వృద్ధులకు రూ. 2 వేల పెన్షన్‌ను, రూ. 4 వేలు చేస్తామన్న హామీని కాంగ్రెస్ విస్మరించింది. వికలాంగుల పెన్షన్‌ను రూ. 4 వేల నుంచి రూ. 6 వేలకు పెంచకుండా కాంగ్రెస్ మోసం చేసింది. మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామన్న హామీ ఏమైంది..? గ్యారెంటీలపై సోనియా గాంధీ సంకతం పెట్టిన గ్యారెంటీ కార్డులను ఇంటింటికి పంచారు. సోనియాగాంధీ ముఖం చూసి ఓట్లేసిన మహిళలను, వృద్ధులను, వికలాంగులు మోసం చేశారు. అందుకే సోనియా గాంధీకి వేలాది పోస్టు కార్డులు పంపించాము. పెన్షన్ల మొత్తాన్ని పెంచాలని రేవంత్ రెడ్డికి ఆదేశాలివ్వాలని సోనియా గాంధీని కోరామని కవిత పేర్కొన్నారు.

# హనీమూన్ పిరియడ్ ముగిసింది.. ఇక యుద్ధమే: వైఎస్ జగన్

అని ప్రశ్నించండి అంటూ ?పార్టీ శ్రేణులకు వైసీపీ అధినేత వైఎస్? జగన్ సూచించారు. తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, పార్లమెంటు నియోజకవర్గాల పరిశీలకులు, జిల్లా పార్టీ అధ్యక్షులతో పాటు, పార్టీ రీజినల్ కో%–%ఆర్డినేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జగన్?మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు. అమలు చేయకపోవడాన్ని ప్రజల్లో ఎండగట్టాలన్నారు.

'చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తుకు తెస్తూ..' పేరుతో వైయస్సార్‌సీపీ ఐదు వారాల కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించి క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారి సంవత్సం అవుతోంది. ఇంత తక్కువ వ్యవధిలో ఒక ప్రభుత్వంపై వ్యతిరేకత ఈ స్థాయిలో గతంలో ఏనాడూ లేదన్నారు. చంద్రబాబు ఈ ఏడాది పాలనలో మోసం, దగా తప్ప ఏమీ లేదు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నిలబెట్టుకోలేదని ఆయన ఆరోపించారు. చంద్రబాబు పచ్చి మోసాలు ప్రజలకు వివరించడమే మన ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. 'ఏడాది గడిచింది. హానీమూన్ పీరియడ్ ముగిసింది. ఇక నుంచి యుద్ధం చేయాల్సిందే. కాబట్టి అందరినీ కలుపుకుపోవాలి. ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఇది ఎమ్మెల్యే అభ్యర్థులకు చాలా కీలకం. ప్రజా సమస్యలు తెలుసుకోవాలి. వారికి అందుబాటులో ఉండాలి. ప్రజల సమస్యలపై పోరాడాలి. అప్పుడే మనం సత్తా చూపగలం...' అని జగన్?పేర్కొన్నారు

# ఏపీ బనకచర్ల ప్రాజెక్టుపై న్యాయ పోరాటం చేస్తాం - మంత్రి ఉత్తమ్



**న్యూస్ డెస్క్,25 జూన్ (కెరటం న్యూస్):** ఏపీ,తెలంగాణ మధ్య వివాదంగా మారిన బనకచర్ల ప్రాజెక్ట్ పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గోదావరి బనకచర్ల ప్రాజెక్ట్ ను ఆపడానికి చట్టపరంగా ముందుకెళ్తామని ఇరిగేషన్ మినిస్టర్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. బనకచర్లతో తెలంగాణకు నష్టమన్న ఉత్తమ్.. తెలంగాణ వాదాన్ని బలంగా వినిపించేందుకు న్యాయపోరాటానికి సంబంధించి రోడ్ మ్యాప్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జూన్ 25న జల సౌధలో సీనియర్ నీటిపారుదల అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జూన్ 30న మధ్యాహ్నం 3 గంటలకు ప్రజా భవన్‌లో గోదావరి –బనకచెర్ల లింక్ ప్రాజెక్టుపై వివరణాత్మక ప్రజెంటేషన్ ఉంటుందన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో ఈ ప్రాజెక్టు ఎలా ఉద్భవించిందో స్పష్టమైన డాక్యుమెంటేషన్‌ను చేర్చడానికి ప్రజెంటేషన్‌ను రెడీ చేయాలని ..తద్వారా ఆంధ్ర ప్రస్తుత చర్య వెనుక ఉన్న రాజకీయ నేపథ్యాన్ని బహిర్గతం చేయాలని ఆయన ఆదేశించారు. ఇప్పటికే జూన్ 19న కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ తో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. బనకచర్లపై కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిబంధనలను అతిక్రమించి బనకచర్ల నిర్మిస్తోందని కంప్లైంట్ ఇచ్చామని భేటీ తర్వాత మంత్రి ఉత్తమ్ తెలిపారు..తమ అభ్యంతరాలను కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్ కు చెప్పినట్లు తెలిపారు. ఏపీ చట్ట వ్యతిరేకింగా నిర్మాణం చేపడుతుందని.. అనుమతులు ఇవ్వద్దని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. బనకచర్ల నిర్మాణంతో తెలంగాణకు అన్యాయం జరిగిందని.. బనకచర్ల పునర్విభజన చట్టానికి పూర్తి విరుద్ధమని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తెలంగాణ రైతుల్లో ఆందోళన నెలకొందని, బనకచర్లకు అనుమతి ఇవ్వద్దని కోరినట్లు చెప్పారు.

ఏపీ తీరుతోనే వివాదం..

సముద్రంలో కలిసే గోదావరి జలాల విషయంలో వాస్తవాలు, రాజకీయాలు ముడిపడి ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. "వాస్తవానికి సముద్రంలో కలిసే జలాలపై ఏపీ, తెలంగాణ కూర్చొని మాట్లాడుకుంటే సమస్య పరిష్కారమయ్యేది. కానీ తెలంగాణ ప్రభుత్వాన్ని సంప్రదించకుండా ఏపీ సీఎం చంద్రబాబు కేంద్రం దగ్గరకు వెళ్లడం సరికాదు. ఇది బీఆర్ఎస్‌కు రాజకీయ ఆయుధంగా మారింది. ఏపీ విభజన చట్టం%–%2014లో రెండు రాష్ట్రాల మధ్య నీటి వివాదాల కోసం ఆఫీసర్స్, టెక్నికల్, అపెక్స్ కౌనిల్స్ ఏర్పాటు చేశారు.

# మెట్రో ఫేజ్-2కు కేంద్రం మొండిచేయి : మంత్రి శ్రీధర్ బాబు

ఫేజ్ II–ఎ కింద 76.4 కిలోమీటర్ల మేర 5 కారిడార్లను రూ.24,269 కోట్లతో నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఫేజ్ II–బి కింద జేబీఎస్ నుంచి మేడ్చల్, శామీర్‌పేట్ మార్గాలకు జాయింట్ వెంచర్‌గా, జైకా, ఏడీబీ నిధులతో, పీపీపీ పద్ధతిలో నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు.

సీఎం రేవంత్ రెడ్డి జూన్ 19న కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో భేటీలో ఈ అంశాన్ని ప్రస్తావించినప్పటికీ, కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ ప్రాజెక్టుపై నిర్ణయం లేకపోవడం రాష్ట్ర ప్రజలను నిరాశపరిచిందని శ్రీధర్ బాబు విమర్శించారు. దేశ జీడీపీలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపిన మంత్రి శ్రీధర్ బాబు.. హైదరాబాద్ వంటి అభివృద్ధి చెందిన నగరం దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని, అటువంటి నగరంలో మెట్రో విస్తరణ జాతీయ ఆర్థిక ప్రాధాన్యత కలిగిన అంశమని, కేంద్రం ఈ ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

# తెలంగాణ ప్రజలను మోసం చేసేందుకే రాష్ట్రపతికి బీసీ బిల్ పంపారు..



**న్యూస్ డెస్క్,25 జూన్ (కెరటం న్యూస్):** తెలంగాణ ప్రజలను మోసం చేసేందుకే రాష్ట్రపతికి బీసీ బిల్ పంపారని బిజెపి ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ రేవంత్ సర్కార్ పై మండిపడ్డారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చెయ్యాలి అంటే.. ఆ బిల్ ను 9 వ షెడ్యూల్ లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వానికి పంపాలని తెలిపారు. కానీ రాష్ట్రపతి కి పంపారు.. రాష్ట్రపతి ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో మాకు తెలియదు. తమిళనాడు రిజర్వేషన్లపై సుప్రీం కోర్టులో కేసు ఉంది. బిల్ ను కేంద్రాన్ని కాదని, రాష్ట్రపతికి ఎందుకు పంపించారని ప్రశ్నించారు. 9 వ షెడ్యూల్ లో లేకుండా బిల్ ఎలా అవుతుంది.. 9 వ షెడ్యూల్ లో చేర్చకుండా రిజర్వేషన్లు అమలు కాదని స్పష్టం చేశారు.

90 శాతం ముస్లింలను బీసీల్లో కలపడం రోల్ మోడల్ అవుతుందా..హైదరాబాద్ లో 50 కార్పొరేషన్లు, స్థానిక సంస్థల పటిష్టత కోసం రాజీవ్ గాంధీ చొరవ తీసుకున్నారని కాంగ్రెస్ చెప్తోంది. తెలంగాణలో 18 నెలలు అయినా.. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేదు. హైకోర్టు స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక తీర్పు ఇచ్చింది. గొంతు చించుకుని మాట్లాడుతున్న రాహుల్ గాంధీ ఎందుకు తెలంగాణ లోని అంశాలపై మాట్లాడారని ప్రశ్నించారు. గ్రామాల్లో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల అభివృద్ధికి సంబంధించిన బిల్లులు కూడా చెల్లించలేదు. కొందరు సర్పంచులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందని తెలిపారు.

సమయానికి ఎన్నికల నిర్వహణ జరగకపోవడం వల్ల ఎన్నో కోట్ల నష్టం వాటిల్లింది.. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం అని హామీ ఇచ్చారు సీఎం రేవంత్.. అమలు చేయలేక ఇతరులపై నెపం నెడుతున్నారు.. చట్టసభల్లో బిల్ ఆమోదించాం.. రాష్ట్రపతి ఆమోదం కోసం బిల్ పంపించాం అంటే కుదరదు.. చట్టపరంగా చెల్లుబాటు కాకపోతే, పార్టీ పరంగా రిజర్వేషన్లు అంటూ మోసం చేస్తున్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే, హైకోర్టు తీర్పును అమలు చెయ్యాలని కోరారు. ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తయింది.. మోడీ ప్రభుత్వం ఈ చీకటి రోజును సంవిధాన్ హత్యా దివస్ గా నిర్వహిస్తోంది.. నేటి తరానికి అనాటి వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఉందని తెలిపారు.

# గ్రామపంచాయతీ ఎన్నికలు 3 నెలల్లో నిర్వహించాలి

ప్రస్తుతం ఆ నిధులు అందక ఇబ్బందులుపడుతున్నారు. వివిధ పథకాల కింద కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడంలేదు. వెంటనే ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి. లేకుంటే పాత సర్పంచులకే బాధ్యతలు అప్పగించాలి" అని కోరారు.

ప్రభుత్వం తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ... సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల ప్రక్రియ చేపట్టాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి మరో నెల రోజుల గడువు అవసరమని కోరారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. ఎన్నికల నిర్వహణపై గతంలో ఒకసారి హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.

ఎన్నికల సంఘం తరపున సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. ఇది పూర్తికాగానే ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలిపాక.. ప్రక్రియ పూర్తి చేయడానికి రెండు నెలల సమయం పడుతుందన్నారు. దీనిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ సకాలంలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఎన్నికల సంఘం చొరవ తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసినందున... ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. న్యాయవాది సమాధానమిస్తూ..రిజర్వేషన్ల ఖరారుతో పాటు ఎన్నికలకు ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి మూడు నెలల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు.

# రోదసిలోకి శుభాంశు శుక్లా



**న్యూస్ డెస్క్,25 జూన్ (కెరటం న్యూస్):** కోట్లాది మంది భారతీయుల ఆకాంక్షలను మోసుకుంటూ భారత వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా రోదసిలోకి వెళ్లారు. యాక్సియం–4 మిషన్‌లో భాగంగా ఆయనతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములను తీసుకుని ఫాల్కన్ 9 రాకెట్ బుధవారం మధ్యాహ్నం నింగిలోకి దూసుకెళ్లిన సంగతి తెలిసిందే. వీరి వ్యోమనౌక తాజాగా భూకక్ష్యలోకి ప్రవేశించి అక్కడ ప్రయాణిస్తోంది. ఈ క్రమంలోనే అంతరిక్షం నుంచి శుభాంశు శుక్లా భారత పౌరులను పలకరించారు. ఇదో గొప్ప ప్రయాణం అని పేర్కొన్నారు.

"నా ప్రియమైన దేశవాసులకు నమస్కారం. 41 ఏళ్ల తర్వాత మనం అంతరిక్షాన్ని చేరుకున్నాం. ఇదో గొప్ప ప్రయాణం. ఇప్పుడు మేం భూ కక్ష్యలో సెకనుకు 7.5 కిలోమీటర్ల వేగంతో తిరుగుతున్నాం. నా భుజాలపై మన త్రివర్ణ పతాకం ఉంది. అది చూస్తుంటే నాతో మీరంతా ఉన్నారనే భావన కలుగుతోంది. ఇది కేవలం నా అంతరిక్ష ప్రయాణం మాత్రమే కాదు.. భారత మానవ సహిత రోదసి యాత్రకు నాంది. ఈ ప్రయాణంలో మీరంతా భాగమవ్వాలని కోరుకుంటున్నా. మన దేశ మానవ సహిత అంతరిక్ష కార్యక్రమాన్ని మనమంతా కలిసి ప్రారంభిద్దాం. జై హింద్. జై భారత్" అని శుభాంశు శుక్లా తన సందేశంలో పేర్కొన్నారు.

ఫ్లోరిడాలోని నాసా కెన్నెడీ స్పేస్‌సెంటర్‌లో బుధవారం మధ్యాహ్నం 12:01 గంటలకు (భారత కాలమానం ప్రకారం) చేపట్టిన ఫాల్కన్ 9 రాకెట్ విజయవంతంగా అంతరిక్షంలోకి వెళ్లింది. కొన్ని నిమిషాల తర్వాత వీరు ప్రయాణిస్తున్న వ్యోమనౌక రాకెట్ నుంచి విడిపోయి భూకక్ష్యలోకి ప్రవేశించింది. 28 గంటల ప్రయాణం తర్వాత.. గురువారం సాయంత్రం 4.30 గంటలకు (భారత కాలమానం ప్రకారం) వీరి వ్యోమనౌక ఐఎస్ఎస్‌తో అనుసంధానం అవుతుంది. ఐఎస్ఎస్‌లో శుభాంశు బృందం 14 రోజుల పాటు ఉంటుంది. భారరహిత స్థితిలో పలు ప్రయోగాలు నిర్వహించడంతో పాటు ప్రధాని మోదీ, పాఠశాల విద్యార్థులు, ఇతరులతో అక్కడినుంచి ముచ్చటిస్తారు..

# అధికారం కోసం రైతులను మోసం చేసిన కాంగ్రెస్

## -విలేకరుల సమావేశంలో లింగాల, కొండబాల



**చింతకాని,25 జూన్ (కెరటం న్యూస్):** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం రావడానికి రైతులను పేదలను మహిళలను మోసం చేసిందని అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ మోసపూరితం మాటలతో ఇబ్బందులు పెడుతుందని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు అన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా చింతకాని మండలం లచ్చగూడెం గ్రామంలో గురుజాల హనుమంతరావు నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాల కమల్ రాజు మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 19 నెలలు గడిచినప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను మాత్రం నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ మంత్రులు గత టిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని దివాలా తీయించిందని ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా గోబెల్స్ ప్రచారం చేస్తూ కాలం గడుపుతున్నారన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పన కోసం రాజీవ్ వికాస్ పథకాన్ని ప్రవేశపెట్టి, ఏ ఒక్కరికి పథకాన్ని మంజూరు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు ముడి పెడుతున్నారని విమర్శించారు. మహిళలకు రూ. 2500 వందలు పెళ్లయిన ఆడబిడ్డలకు తులం బంగారం, రైతులకు బోనస్ ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. రైతులకు తొమ్మిది వేల కోట్ల రూపాయలు రైతు భరోసా కింద ఇచ్చామని సంబరాలు చేసుకోవడం దారుణం అన్నారు. రాష్ట్రంలో దళితుల కుటుంబాల అభివృద్ధి కోసం మాజీ సీఎం కేసీఆర్ ప్రతి కుటుంబానికి రూ. 10 లక్షలు ఉపాధి కల్పన కోసం ఇచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రూ. 12 లక్షలు ఇస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా ఇవాళ్ళకు కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి ప్రజలను మోసం చేసేందుకు స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవడం కోసం మోసం చేస్తుందన్నారు.

మాజీ రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్, మధిర మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు ఏం చేశారని సంబరాలు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఈరోజు వరకు కూడా 45 శాతం మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. ఆనాడు రేవంత్ రెడ్డి బ్యాంకులో రెండు లక్షల వరకు రుణాలు తెచ్చుకోండి మా ప్రభుత్వం రాగానే మాఫీ చేస్తామని అబద్ధాలు చెప్పి ఇప్పుడు 2 లక్షల లోపు రుణాలు మాత్రమే రుణమాఫీ చేస్తామని చెప్పడం మోసం చేయడం కాదా అన్నారు. అంతేకాకుండా రైతులకు కేసీఆర్ ఎకరాకు పదివేల రూపాయలు పంటల పెట్టుబడి కోసం రైతుబంధు పథకాన్ని అమలు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఎకరాకు 15000 రూపాయలు ఇస్తామని చెప్పి 12000 కే కుదించారు అన్నారు. పైగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు అందవలసిన రైతు భరోసా ను రెండు సీజన్లకు ఎగ్గొట్టిందని, ఒకసారి కేవలం మూడున్నర ఎకరాల రైతులకు మాత్రమే రైతు భరోసా చెల్లించిందన్నారు. కుంట భూమి ఉండి రైతు మృతి చెందితే ఆ కుటుంబానికి రూ. ఐదు లక్షలు బీమా చెల్లించిందన్నారు. ప్రభుత్వంలో ఎంత మంది చనిపోయిన బీమా చెల్లించడానికి కూడా అభ్యంతరాలు వ్యక్తం చేయడం దారుణమన్నారు.రైతులకు ఇచ్చిన వాగ్దానాలను మరిచింది మోసం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం ఏం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను తోడ్పాటు అందించామని సంబరాలు చేసుకుంటున్నారా... మోసాలు చేశామని సంబరాలు చేసుకుంటున్నారా అన్న విషయంపై సందేహాలు వ్యక్తమవు తున్నాయన్నారు. ఈ సమావేశంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పెంట్యాల పుల్లయ్య, మాజీ జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు మంకెన రమేష్, మాజీ ఎంపీపీ మునుగోడు రత్నాకర్, గురజాల హనుమంతరావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు వెంకట రామారావు, వంకాయలపాటి సత్యనారాయణ, గురుజాల కృష్ణయ్య, పువ్వాల వెంకటేశ్వర్లు, ఎండపల్లి జనార్దన్ రావు, తాతా ప్రసాద్,కొల్లి బాబురావు, సామినేని అప్పారావు, బొగ్గరపు రాంబాబు, రాచబంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# బీసీలకు బరాబర్ 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

## ఎంపీ వద్దిరాజు డిమాండ్



**హైదరాబాద్ బ్యూరో,25 జూన్ (కెరటం న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్యా, ఉద్యోగ రంగాలలో వెనుకబడిన కులాల వారికి 42శాతం రిజర్వేషన్స్ అమలు చేయాల్సిందేనని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థలకు వచ్చే 3 నెలల లోగా ఎన్నికలు జరిపించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఎంపీ రవిచంద్ర స్వాగతించారు. కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా బీసీలకిచ్చిన హామీ మేరకు ఈ ఎన్నికల నుంచే 42 శాతం రిజర్వేషన్స్ అమలులోకి తేవాలని, ఇందుకోసం తమ పార్టీ పోరాటాన్ని సాగిస్తుందన్నారు. కులగణన సందర్భంగా పాలకులు ఉద్దేశపూర్వకంగా చేసిన తప్పిదాలను బీఆర్ఎస్ సభలు, సమావేశాలలో ఎత్తిచూపి ఎండగట్టడాన్ని తన ప్రకటనలో ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు.స్వాతంత్ర్యం సిద్ధించి 80 ఏండ్లు సమీపిస్తున్నా కూడా బీసీ కులాలు ఆనాటి నుంచి ఈనాటి వరకు అన్ని రంగాలలో వెనుకబడి ఉండడానికి కాంగ్రెస్ పాలకులే ముఖ్య కారకులని ఎంపీ రవిచంద్ర మండిపడ్డారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు 10 ఏండ్ల పాలనలో బీసీలకు సముచిత గౌరవం లభించిందన్నారు. అసెంబ్లీ స్పీకర్ గా మధుసూదనాచారి, శాసనమండలి ఛైర్మన్ గా స్వామిగౌడ్, ఆర్థిక మంత్రిగా ఈటల రాజేందర్, హైదరాబాద్ మహానగర మేయర్ గా బొంతు రాంమోహన్ తదితర నాయకులకు ఉన్నత పదవులిచ్చి.. కేశవరావు, బండా ప్రకాష్, డీ.శ్రీనివాసుతో పాటు తనను రాజ్యసభకు పంపి గౌరవించారని ఎంపీ వద్దిరాజు వివరించారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిన తొలినాళ్లలోనే ఎస్సీ కులాల వర్గీకరణకు అనుకూలంగా, బీసీలు, మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్స్ అమలుపర్చాల్సిందిగా తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించిన విషయాన్ని ఎంపీ రవిచంద్ర మరోసారి గుర్తు చేశారు.అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసి పోరాడడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగివచ్చి 42శాతం రిజర్వేషన్స్ కోసం అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపడం జరిగిందన్నారు. కేవలం తీర్మానాలతోనే సరిపెట్టకుండా, వాటిని అమలు చేయించాల్సిన అసలు సమయమిప్పుడు ఆసన్నమైనదని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. పంచాయతీరాజ్, మునిసిపల్ ఎన్నికలతో పాటు విద్యా, ఉద్యోగ రంగాలలో కూడా 42% రిజర్వేషన్స్ అమలు చేయాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం కాంగ్రెస్ పాలకులు, ఆ పార్టీ జాతీయ నాయకత్వం కేంద్ర ప్రభుత్వంపై మరింత వత్తిడి పెంచాలని, అఖిల పక్షాన్ని ప్రధాని నరేంద్రమోడీ వద్దకు తీసుకుపోవాలని ఎంపీ రవిచంద్ర డిమాండ్ చేశారు. 42శాతం రిజర్వేషన్స్ అమలునకు బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని, పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు బీసీల పక్షాన సంపూర్ణ మద్దతునిస్తుందని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు.

# బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలు విడుదల చేయాలి

## దళిత, గిరిజనల బిడ్డలను విద్య నుంచి దూరం చేయవద్దు

## రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసిన భూక్యా వీరభద్రం



**వైరా టౌన్,25 జూన్ (కెరటం న్యూస్):** రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలను ప్రభుత్వం ఇప్పటికీ విడుదల చేయకపోవడం తీవ్రమైన అన్యాయమని. ఈ స్కీం ద్వారా కార్పొరేట్ విద్యలో అవకాశం పొందుతున్న దళిత, గిరిజన విద్యార్థుల భవిష్యత్‌ని రాష్ట్ర ప్రభుత్వం ప్రమాదంలోకి నెట్టుతోంది. విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం క్రింద 6 వేల మంది గిరిజన విద్యార్థులు సహా మొత్తం 25 వేల మంది విద్యార్థులు చదువుతుంటే, ప్రభుత్వం రూ.154 కోట్లు బకాయి చెల్లించకపోవడం వల్ల పాఠశాలలు వసతి, భోజన సదుపాయాలను నిలిపివేస్తున్నాయి. దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎనిమిది నెలలు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర పాలనలో ఉన్నా కూడా బకాయిలు విడుదల చేయకపోవడం విద్యను నిర్లక్ష్యం చేయడమే. అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బకాయిలు తక్షణమే కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు %-% తక్షణం జోక్యం చేసుకుని ఈ సమస్యను పరిష్కరించాని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే, విద్యా హక్కు కోసం గిరిజన సంఘం తీవ్ర స్థాయిలో ప్రజా ఉద్యమాలను అన్ని ప్రజాసంఘాలను రాజకీయ పార్టీలను కలుపుకొని నిర్వహించాల్సి వస్తుంది. దానికి పూర్తి బాధ్యత ప్రభుత్వం మీదే ఉంటుంది. తెలిపారు. వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు.

# బనకచర్ల పై బహిరంగ లేఖ



నీళ్ల రాజకీయం ముసుగులో సెంటిమెంట్ రాజేసే కుహానా మేధావులకు సూటి ప్రశ్న

సెంట్రల్ వాటర్ కమిషన్ లెక్కల ప్రకారం ప్రతి ఏటా రెండు నుంచి మూడు వేల టీ. ఎం సీ గోదావరి జలాలు సముద్రం పాలయ్యేది నిజం కాదా?

కేసీఆర్ ముఖ్యమంత్రి హోదాలో రాయలసీమను రత్నాల సీమ చేస్తానంటే నాడు ఈ కుహానా మేధావులు నిద్ర పోయారా?

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గా ఎవరున్నా ఎన్ని ప్రాజెక్ట్ లు కట్టినా రెండు వేల టీ. ఎం సీ లను వినియోగించే ఆయకట్టు ఉందా?

కాళేశ్వరం లేకుండానే కోటి ఎకరాలు సాగు చేస్తే ..భవిష్యత్ లో కట్టే ప్రాజెక్ట్ లు ఎన్ని కట్టినా తెలంగాణ వినియోగించే సామర్థ్యం ఎంత.?

రెండు రాష్ట్రాలుగా విడి పోయినా అన్న దమ్ముళ్లలా తెలుగు వారు అభివృద్ధి చెందాలనే నేతలు ఎవ్వరు? తేలిపోయింధా?

సముద్రంలో కలిసే గోదావరి జలాలను కృష్ణా బేసిన్ కు తరలించి రాయలసీమ ను సస్య శ్యామలం చేసే చంద్రబాబు అపర భగీరథుడు ప్రయత్నం పై కళ్ల మంట ఎందుకు?

బీ.అర్.ఎస్ ట్రాఫ్ లో కాంగ్రెస్ ఎందుకు పడాలి?

రెండు నుంచి మూడు వేల టీ.ఏం.సీ ల్లో తెలంగాణ అంతా నీళ్ళు పారించడానికి ఎన్ని టీ. ఎం సీ లు కావాలి?

ప్రాక్టికల్ గా ఆలోచన చేయకుండా విద్వేషం ఎందుకు?

జులై లోనే గోదావరి వరద జలాలతో కృష్ణా బేసిన్ ప్రాజెక్ట్ లకు సాగు నీరు చేరుతుంది

కృష్ణా నది ఆగస్ట్ లో వరద లు వస్తాయి అప్పటికే రాయలసీమ ప్రాజెక్ట్ లు నిండి ఉంటాయి శ్రీశైలం నాగార్జున సాగర్ నుంచి నీళ్ల అవసరం ఉండదు

తెలంగాణ కు శ్రీశైలం నాగార్జున సాగర్ నీళ్ళు వినియాగం పై ఆంధ్రా ఒత్తిడి ఉండదు

ముఖ్యమైన విషయం

ఒకవేళ బనకచర్ల ప్రాజెక్ట్ లేకపోతే రాయలసీమ ..నాగార్జున సాగర్ ఆయకట్టు కు కృష్ణా నీళ్ళే దిక్కు

శ్రీశైలం..సాగర్ నీటి కోసం రెండు రాష్ట్రాలు కొట్టుకునే బదులు చంద్రబాబు నాయుడు ఎంతో లాంగ్ విజన్ తో గోదావరి కృష్ణా నదుల అనుసంధానం అర్థం చేసుకోకుండా రాజకీయ కుట్రలు ఇంకెంత కాలం?

నీళ్ల మంటలు రాజేసే కుహానా మేధావులుకు బహిరంగ సవాల్

ప్రతి ఏటా సముద్రంలో కలిసే గోదావరి వరద జలాలు తెలంగాణ కు ఎన్ని అవసరం.?

ఇంకెన్ని ప్రాజెక్ట్ లు కట్టాలి?

తెలంగాణ రాష్ట్రం రెండు వేల టీ.ఏం.సీ లు వినియోగించే ప్రాజెక్ట్ లు కట్టినా..సముద్రం దిక్కు పోయే వరద జలాల్లో రెండు వందల టీ. ఎం సీ లు రాయలసీమ ను సస్య శ్యామలం చేసి శ్రీశైలం నాగార్జున సాగర్ ఆయకట్టు స్థిరీకరణ కు చంద్రబాబు గారు చేసే ప్రయత్నాలు అర్థం చేసుకోకుండా ఇంకా సెంటిమెంట్ రాజకీయాలు చేసే నేతలు చరిత్ర హీనులుగా మిగులుతారు.

ప్రకృతి ప్రసాదించిన వనరులు ప్రజా ప్రయోజనం కోసం చంద్రబాబు నాయుడు రూపకల్పన చేస్తుంటే...బాబు భగీరథ ప్రయత్నం పై కుట్రలు చేస్తున్న వారు గోదారమ్మ మహోగ్ర ప్రవాహం లో కొట్టుకు పోతారు.

మందడపు సుధాకర్
రైతు సంఘం నాయకులు
ఖమ్మం

## న్యాయమూర్తి పై బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం



**ఖమ్మం లీగల్,25 జూన్ (కెరటం న్యూస్):** ఖమ్మం జిల్లా కోర్టులో విధులు నిర్వహిస్తున్న రెండవ అదనపు న్యాయమూర్తి ఏపూరి బిందు ప్రియ కొనసాగిస్తున్న ఒంటెద్దు పోకడలపై మంగళవారం ఖమ్మం బార్ అసోసియేషన్ హాల్లో న్యాయవాద సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తికి వ్యతిరేకంగా కొన్ని తీర్మానాలు చేశారు. ఈ నెల 30 తారీఖు వరకు రెండవ అదనపు కోర్టు విధుల బహిష్కరణ

**ఐదుగురు న్యాయవాదులకు బార్ అసోసియేషన్ షోకాస్ నోటీసులు జారీ**



ఈనెల 28 వ తేదీన ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం కోర్టు నుండి న్యాయవాదులు రెండు బస్సులలో బయలుదేరి తెలంగాణ హైకోర్టు , హైదరాబాద్ ముందుర నిరసన కార్యక్రమం ఉంటుందని కావున బార్ అసోసియేషన్ పిలుపుమేరకు ప్రతి ఒక్క న్యాయవాది హాజరు కావలసిందిగా అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో కూడా ఈ న్యాయమూర్తిపై హైకోర్టులో పలు ఫిర్యాదులు ఉండడం కోసమెరుపు.

## బోనాలు సందర్భంగా ఎంపీ వద్దిరాజు శుభాకాంక్షలు



**హైదరాబాద్ బ్యూరో,25 జూన్ (కెరటం న్యూస్):** బోనాల పండుగ ప్రారంభం సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చారిత్రాత్మక గోల్కొండ ఖిల్లాలో వెలిసిన జగదాంభిక ఎల్లమ్మ తల్లికి ఆషాఢ మాసంలో గురువారం మొదటి బోనం సమర్పించడంతో ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు.ఆ తర్వాత జులై 13న సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి, అటుతర్వాత పాతబస్తీలో బోనాల ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని ఎంపీ రవిచంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే బోనాల పండుగ సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తన హయాంలో ప్రత్యేక నిధులు కేటాయించి ప్రాధాన్యతనిచ్చారని, విశేష ప్రాచుర్యం కల్పించారని ఎంపీ రవిచంద్ర వివరించారు.బోనాల పండుగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ప్రశాంత వాతావరణంలో భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఎంపీ రవిచంద్ర ఆకాక్షించారు. అమ్మవార్ల కరుణాకటాక్షాలు, ఆశీస్సులతో తెలంగాణ బిడ్డలందరూ సుఖ శాంతులు, ఆయురారోగ్యాలతో జీవించాలని, వానలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా వర్థిల్లాలని ఎంపీ వద్దిరాజు అభిలషించారు.

## మాగ్నస్ కార్ల్‌సెన్‌కు చెమటలు పట్టించిన 9 ఏళ్ల ఢిల్లీ బాలుడు





**స్పోర్ట్స్ న్యూస్,25 జూన్ ( కెరటం న్యూస్):** ప్రపంచ చెస్ నంబర్ వన్ మాగ్నస్ కార్ల్‌సెన్‌కు ఢిల్లీకి చెందిన తొమ్మిదేళ్ల ఆరిత్ కపిల్ చెమటలు పట్టించాడు. మంగళవారం అర్ధరాత్రి ప్రముఖ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో జరిగిన 'ఎర్లీ టైటిల్డ్ ట్యూసడే' చెస్ టోర్నమెంట్‌లో కార్ల్‌సెన్‌ను ఆరిత్ ఓడించినంత పనిచేశాడు. తొమ్మిదేళ్ల అరిత్ ఎత్తుల ముందు ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ అయిన కార్ల్‌సెన్ తడబడ్డాడు. అయితే ఆఖరి రౌండ్‌లో సమయం దగ్గరపడుతుండంతో కపిల్ తనకు లభించిన అవకాశాన్ని ఉపయెగించుకోలేకపోయాడు. దీంతో గేమ్ డ్రాగా ముగిసింది.

ఆరిత్ ఈ ఈవెంట్‌లో జార్జియా నుంచి పాల్గొన్నాడు. అతడు ప్రస్తుతం జార్జియా వేదికగా జరుగుతున్న అండర్-10 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పోటీపడుతున్నాడు. ఇప్పటికే రెండు రౌండ్లలో విజయం సాధించిన అరిత్..బుధవారం తన మూడవ గేమ్ ఆడనున్నాడు. అంతకుముందు అండర్-9 ప్రపంచ ఛాంపియన్‌షిప్ రన్నరప్‌గా ఆరిత్ నిలిచాడు.

మరోవైపు భారత్‌కు చెందిన వి. ప్రణవ్ 10 పాయింట్లతో ఈ 'ఎర్లీ టైటిల్డ్ ట్యూస్‌డే' టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. అమెరికన్ గ్రాండ్‌మాస్టర్ హాన్స్ మోక్ నీమాన్ , కార్ల్‌సెన్ ఇద్దరూ 9.5 పాయింట్లతో ముగించారు. కానీ టైబ్రేక్‌లో నీమాన్ రెండవ స్థానాన్ని దక్కించుకున్నాడు.

## రూ.100 కోట్ల క్లబ్‌లోకి 'కుబేర'.. టీమ్ అధికారిక ప్రకటన




**మూవీ న్యూస్, 25 జూన్ (కెరటం న్యూస్):** ధనుష్ , నాగార్జున కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కుబేర' . జూన్ 20న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విడుదలైన నాటి నుంచి ఇది బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా వసూళ్లపై తాజాగా టీమ్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఇప్పటివరకూ ఇది ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు అంచనా అని తెలిపింది. తమ చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు చెప్పింది. దీనిపై సినీ ప్రియులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన వ్యక్తికి.. వీధుల్లో జీవించే ఓ అతి పేదవాడికి మధ్య జరిగే సంఘర్షణే ప్రధాన ఇతివృత్తంగా రూపొందిన చిత్రం 'కుబేర'. రష్మిక కథానాయిక. దేవా పాత్రలో ధనుష్, దీపక్‌గా నాగార్జున నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ముఖ్యంగా భిక్షగాడు పాత్రలో ధనుష్ నటనకు అంతటా ప్రశంసలు దక్కాయి. సుమారు 3 గంటలకు పైగా రన్‌టైమ్‌తో ఈ సినిమా నిర్మితమైంది.


## జార్జియా షెడ్యూల్ కంప్లీట్ చేసుకున్న 'అఖండ 2'



**మూవీ న్యూస్, 25 జూన్ (కెరటం న్యూస్):** నటసింహం నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'అఖండ 2' (తాండవం). బ్లాక్ బస్టర్ సినిమా 'అఖండ' చిత్రానికి సీక్వెల్‌గా ఈ చిత్రం రాబోతుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుంది. ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభమేళాలో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించిన చిత్ర యూనిట్ జార్జియాలో పలు కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్న విషయం తెలిసిందే. అయితే తాజాగా జార్జియా షెడ్యూల్‌ని కూడా చిత్రబృందం పూర్తి చేసుకున్నట్లు సమాచారం. జార్జియా షెడ్యూల్ అనంతరం అఖండ టీమ్ రామోజీ ఫిల్మ్ సిటీలో కీలక ఎపిసోడ్‌లను చిత్రీకరించబోతుంది..14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా.. థమన్ సంగీతం అందిస్తున్నారు. సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తుండగా, యంగ్ హీరో ఆది పినిశెట్టి విలన్ పాత్రలో కనిపించనున్నారు. బాలయ్య మరోసారి అఘోరి పాత్రలో ప్రేక్షకులను మెప్పించడానికి సిద్ధమవుతున్నారు. ఈ సినిమా 2025 సెప్టెంబర్ 25న దసరా కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## హార్దిక్ పాండ్యతో డేటింగ్ వార్తలపై స్పందించిన నటి





**మూవీ న్యూస్, 25 జూన్ (కెరటం న్యూస్):** టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య తో బాలీవుడ్ నటి ఇషా గుప్తా డేటింగ్‌లో ఉన్నట్లు గత కొన్ని రోజులుగా వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ వార్తలపై ఎట్టకేలకు స్పందించింది నటి ఇషా గుప్తా.

తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఇషా గుప్తా మాట్లాడుతూ.. అవును, మేమిద్దరం కొంతకాలం మాట్లాడుకున్నాం. కానీ మేము డేటింగ్ చేశామని నేను అనుకోవడం లేదు. కొన్ని నెలల పాటు మా మధ్య సంభాషణలు జరిగాయి. బహుశా ఇది జరగవచ్చేమో, లేదా జరగకపోవచ్చేమో అన్న దశలో ఉండేవాళ్లం. మేం డేటింగ్ దశకు చేరుకోకముందే అది ముగిసిపోయింది. కాబట్టి దాన్ని డేటింగ్ అని చెప్పలేం అని వివరించారు. తమ మధ్య ఎలాంటి గొడవలు లేవని, మనస్పర్థలు కూడా రాలేదని.. అయితే మేము కలవడం అనేది రాసిపెట్టిలేదని తెలిపారు. మేమిద్దరూ చాలా భిన్నమైన వ్యక్తులమని, అందుకే విషయాలు ముందుకు సాగలేదని ఇషా చెప్పుకోచ్చారు.